గుర్తింపునకు నోచుకోని బహుముఖ ప్రజ్ఞాశాలి దిగవల్లి శివరావు

తెలుగులో మొదటి వచన గ్రంథం కాశీ యాత్ర చరిత్ర. ఏనుగుల వీరస్వామయ్య అనే ప్రభుత్వోద్యోగి క్రీ.శ. 1830 ప్రాంతంలో చెన్నపట్టణం నుంచి బయలుదేరి కాశీవిశ్వనాథుని సందర్శించుకుని తిరిగి మద్రాస్‌కు చేరుకున్నారు. ఆ రోజులలో రైళ్ళు బస్సులు వంటి ప్రయాణ సాధనాలు వుండేవికావు. కాలినడకనో బళ్ళమీదనో మజిలీలు చేసుకుంటూ కాశీ చేరుకుని తిరిగి రావడానికి అనేక నెలలు పట్టేది. అందువల్లనే కాశీకి వెళ్ళినవాడు కాటికి వెళ్ళినవాడు తిరిగి వచ్చే నమ్మకం లేదన్న సామెత పుట్టింది. ఆ విధంగా వీరస్వామయ్యగారు అనేక ప్రాంతాలను సందర్శించుకుంటూ కాశీయాత్రను పూర్తిచేసుకుని వచ్చారు. అంతటితో సరిపెట్టకుండా తన సుదీర్ఘ అమిత వ్యయ ప్రయాసభరిత కాశీయాత్ర సందర్భంగా, తను సందర్శించిన ప్రాంతాలు, అక్కడి విశేషాలు, అక్కడి ప్రజల ఆచారవ్యవహారాలు, ముఖ్యంగా తిరుగు ప్రయాణంలో తను చూచిన తెలుగు ప్రాంతాలూ, పట్టణాలు, వాటి విశేషాలు, ప్రజల స్థితిగతులు, ఆచారవ్యవహారాలను నిశితంగా గమనించి వాటిని గ్రంథస్థం చేశారు - కాశీయాత్రచరిత్ర అన్న పేరుతో క్రీ.శ. 1838 సంవత్సరంలో దాన్ని ముద్రించారు. తెలుగులో ప్రింటింగ్ ప్రెస్సులు శైశవస్థితిలో వుండగా ఈ గ్రంథం వెలువడింది. తగినంత ఆదరణ ప్రచారం లేనందువలన 19వశతాబ్దంలో తెలుగు ప్రజల సామాజిక ఆర్థిక రాజకీయ జీవితానికి అద్దం పట్టే ఆ గ్రంథం శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోతున్న సమయంలో 1941లో అనగా దాదాపు వంద సంవత్సరాలకు బెజవాడకు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన దిగవల్లి వెంకట శివరావుగారు దీనిని పునర్ముద్రించి తెలుగు ప్రజలకు మరపురాని మహోపకారం చేశారు. అంతేగాక సంపాదకుని పీఠిక, రచయిత జీవిత విశేషాలు, చరిత్రాంశ వివరాలు, ఆనాటి సామాజిక పరిస్థితులను, మ్యాపులను అనుబంధంగా ప్రచురించి ఆ గ్రంథవిలువను మరిన్నిరెట్లు పెంచారు. 19వశతాబ్దపు పూర్వభాగ తెలుగు ప్రజల సాంఘిక జీవనాన్ని తెలుసుకోవడానికి యింతకు మించిన ప్రామాణిక గ్రంథం లేదు. శివరావుగారు భగీరథకృషి చేసి, ఈ గ్రంథాన్ని పునర్ముద్రించకుండా వున్నట్లయితే ఈ అమూల్య గ్రంథం శాశ్వతంగా అంతరించిపోయి వుండేది. ఆయన భగీరథకృషి ఈ ఒక్క గ్రంథానికే పరిమితంకాక బహుముఖంగా విస్తరిల్లింది. చరిత్ర పరిశోధన, తెలుగు పారిభాషిక పద నిఘంటు రచన పత్రికా రచన, గ్రంథరచన, సాహిత్య సేవలు జాతీయతా భావాలు న్యాయవాద నైపుణ్యం వీటన్నిటినీ కలయుపోస్తే వచ్చే రూపం శివరావుగారు.

శివరావుగారు 1898 ఫిబ్రవరి 14వతేదీన కాకినాడలో జన్మించారు. ప్రాథమిక విద్య పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగింది. అప్పుడు అడవి బాపిరాజు ఆయన సహాధ్యాయి. ఆ తర్వాత రాజమండ్రి వీరేశలింగం ఆస్తికోన్నత పాఠశాలలో హైస్కూలు విద్య నేర్చారు. అప్పుడు గజవల్లి

కంచి వాసుదేవరావు

రామచంద్రరావుగారు హెడ్మాష్టరు. వందేమాతరం ఆందోళన సందర్భంగా బిపిన్‌చంద్రపాల్ రాజమండ్రి వచ్చినప్పుడు ఆయన ఉపన్యాసాలకు ఉత్తేజితుడైన యువకులూ విద్యార్థులలో రామచంద్రరావు గారొకరు. వందేమాతరం బాడ్జి ధరించి కాలేజీకి హాజరయినందుకు ప్రిన్సిపాల్ హంటర్ ఆగ్రహానికి గురి అయి కాలేజీ నుండి బహిష్కరింపబడ్డారు. అదే విధంగా బహిష్కరింపబడిన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి సహాధ్యాయి. భారత స్వాతంత్ర్యసమరంలో జైలు శిక్షననుభవించిన తొలివిడత నాయకులలో ఆయనొకడు. క్రమశిక్షణకు ఆదర్శప్రాయుడైన వ్యక్తి. బహుశః ఆ కాలంలోనే -రామచంద్రరావుగారి జాతీయ భావాలూ క్రమశిక్షణా శివరావుగారిపై తన ప్రభావాన్ని చూపించి వుండవచ్చు.

మద్రాస్ క్రైస్తవకళాశాలలో చదువుతూ వుండగా ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావుగారు గురువు. మద్రాసు లా కాలేజీలో చదువుతూ వుండగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కోకా సుబ్బారావుగారు ఆయన సహాధ్యాయి. ఇటువంటి గురూత్తములు,

సహోధ్యాయుల ప్రభావం శివరావుగారు సంపూర్ణ వ్యక్తిత్వంతో ఎదగడానికి తోడుపడి వుండవచ్చు.

చరిత్ర పరిశోధన పట్ల మక్కువ శివరావుగారికి ఎప్పుడు ఎల్లా కలిగిందో తెలియదు. కాని తన జీవితంలో గణనీయ భాగాన్ని చరిత్ర పరిశోధనలోనే గడిపారు. బ్రిటీషుపాలనలో ముఖ్యంగా 1757వ ప్లాసీయుద్ధవిజయంతో ప్రారంభమయి 1857 ప్రథమ భారతస్వాతంత్ర్య సంగ్రామం వరకు సాగిన ఈస్టిండియా కంపెనీ పాలనలో తెలుగు దేశ స్థితిగతులూ, ఆ కాలపు చారిత్రక సంఘటనపై ప్రధానంగా పరిశోధనలు జరిపి అనేక విషయాలను వెలుగులోకి తెచ్చారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం జరగడానికి 1885లో అఖిలభారత కాంగ్రెస్ అవతరణకు దారి తీసిన పరిస్థితుల గురించి శివరావు పరిశోధనలు చేసి కథలూ, గాథలు ద్వారా నాటిని వివరించారు. ఈ పరిణామాలకు దోహదపడిన ప్రముఖులను వెలుగులోకి తీసుకువచ్చారు.

అంతేకాదు కాశీ మసీదులోని శివలింగం గురించి మహ్మదీయుల దశావతారాలగురించీ, మద్రాస్ గవర్నరు శిక్షించిన దివానుల గురించీ, చెన్నపట్టణం దాని పూర్వ చరిత్ర గురించీ, అక్బరు కాలంనాటి భారతదేశం గురించీ, రాజారామమోహనరాయ్ రాజనీతి గురించీ, బెజవాడ పోలీస్ వ్యవస్థ న్యాయవ్యవస్థ పుట్టుపూర్వోత్తరాల గురించీ పరిశోధనాత్మక రచనలు చేశారు. 1857 పూర్వరంగం గురించి శివరావుగారు రాసిన వ్యాసాలు చదివి కవిసామ్రాట్ విశ్వనాథసత్యనారాయణగారు ప్రళయనాయుడు అనే నవలను రచించి శివరావుగారికే అంకితమిచ్చారు.

నిష్ఠురమైన నిజాలు చెప్పి విరోధాలు తెచ్చుకునే కోవకు చెందినవారు శివరావుగారు. ఆయనకు రాజమండ్రిలో చదువుకుంటూవుండగానే వీరేశలింగం గారిని సందర్శించు కున్నారు. వీరేశలింగం గారి జీవితాన్ని, జీవిత విధానాలను నిశితంగా పరిశీలించిన శివరావుగారికి వీరేశలింగంగారి జీవితంలో వెలుగు కిరణాలతోపాటు కొన్ని చీకటి మరకలు కూడా వున్నట్లు తెల్సింది. ఆయనలోని బలహీనతలూ దౌర్బల్యాలూ, లోపాలను ఎత్తిచూపుతూ వీరేశలింగంగారి జీవితములో వెలుగునీడలు అన్న సంచలనాత్మక గ్రంథం వ్రాశారు. దాంతో వీరేశలింగం గారి భక్తులూ, అభిమానులూ శివరావుగారిపై విరుచుకుపడ్డారు.

మనలో కొన్ని బలహీనతలు వుంటాయి. మనం భగవంతుని ప్రతిరూపంగా యుగపురుషునిగా కొందరను అరాధిస్తాం. తప్పులేదు. కాని వారిలో ఏ లోపమూ లేని పరిపూర్ణులుగా భావిస్తాం. ఎవరయినా వారిలో లోపాలు ఎత్తి చూపితే సహించలేం. వారిని తీవ్రంగా నిందిస్తాం. ఎంతటి మహావ్యక్తి అయినా, అతను మానవుడైన కారణాన కొన్ని బలహీనతలూ, దౌర్బల్యాలు వుంటాయని వారు కొన్ని పొరపాట్లు చేయడం సహజం అన్న సత్యాన్ని అంగీకరించ జాలం. ఆ మహా వ్యక్తి విరజిమ్మే వెలుగు కిరణాలలో ఆ మరకలు కన్పించకపోవచ్చు. అంతమాత్రాన అవి లేనట్లుకాదు. అదీకాక, ఏవో కొన్ని స్వల్పలోపాలు వ్యక్తిగత బలహీనత లున్నంతమాత్రాన, ఆ వ్యక్తి సర్వతోముఖంగా చేసిన విశిష్ట సేవలు మరుగు పడవు. ఈ సహృదయత లేనందువల్లనే శివరావుగారిపై వీరేశలింగంగారి అభిమానులు మండి పడ్డారు. యదార్థవాదులై లోకవిరోధం తెచ్చుకోవడంతో సమ ఉజ్జీలైనందువల్లనే శివరావుగారు, బండి గోపాలరెడ్డిగారు (బం.గో.రె.)పరస్పరం ఎంతగానో అభిమానించుకునేవారు.

శివరావుగారు భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచిక కృష్ణాపత్రిక, ప్రజామిత్ర మొదలైన అనేక పత్రికల్లోనూ కొన్ని ప్రత్యేకసంచికలలో విభిన్న విషయాలపై విశిష్ట రచనలు చేశారు. అనేక సంవత్సరాలు ప్రకాశంగారు మద్రాస్ నుంచి నడిపిన స్వరాజ్య పత్రికకు బెజవాడపట్టణ విలేఖరిగా పనిచేశారు. సాహిత్యం, రాజనీతి, ఆర్థికవిషయం, శాస్త్రములు, పరిపాలన, సంస్కృతి సహకారం మొదలైన వైవిధ్యంగల విషయాలపై వ్యాసాలు రచించారు.

శివరావుగారు రాజమండ్రిలో చదువుకుంటున్న రోజులలో వారిలో రాజకీయ భావాలు మొలకలెత్తాయి. 1920లో మహాత్మాగాంధి వినూత్న పద్ధతులతో స్వాతంత్ర్య సమరం ప్రారంభించే నాటికి అవి ఏపుగా పెరిగి మొక్కలయ్యాయి. భారతస్వాతంత్ర్య సమరచరిత్రలో 1930దశకానికి విశిష్టస్థానం వుంది. ఉప్పు సత్యాగ్రహం, సహాయనిరాకరణ రౌండుటేబులు సమావేశాలు, గాంధి ఇర్విన్ ఒడంబడిక కాంగ్రెస్ మంత్రి వర్గాలు ఏర్పాటు మొదలైన ఘట్టాలు వున్నాయి. 1930-32 సంవత్సరాల మధ్య శివరావుగారు పశ్చిమకృష్ణాజిల్లా కాంగ్రెస్ ప్రచారక్‌గా పనిచేశారు. గాంధీజీ సందేశం స్వాతంత్ర్యసమర విధానాల గురించి ప్రచారసందర్భంగా సత్యాగ్రహచరిత్ర నిర్భాగ్యభారత దరిద్రనారాయణీయం, బార్డోలీ సత్యాగ్రహ బోధిని విజయం సత్యాగ్రహ విదేశీ వస్తుబహిష్కారం అనే లఘు పుస్తకాలు రచించి ప్రచురింపచేసి ప్రచారం చేశారు. పాంచజన్యం అన్న

పేరిట నాడు ప్రచారంలో వున్న ఉత్తేజకరమయిన దేశభక్తి గీతాలను సంకలనం చేశారు. ఈ పనుల వలన సహజంగా ఆయన బ్రిటీష్ ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు. బ్రిటీష్ అధికారులు బెజవాడలోని ఆ యింటిని సోదాచేసి పుస్తకాలన్నిటినీ స్వాధీనపరుచుకున్నారు. ఆయనపై కేసును నమోదుచేసి జైలుకు పంపటానికి రెండుసార్లు ప్రభుత్వం ప్రయత్నించింది. ఒకసారి సాంకేతిక లోపం వలన కోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించలేదు. రెండవసారి వీసా కేసు పెట్టేలోగా గాంధి ఇర్విన్ ఒడంబడిక కుదిరినందువలన ప్రభుత్వం కేసు పెట్టే ప్రయత్నాన్ని విరమించుకుంది.

శివరావుగారి ప్రజ్ఞాపాటవాలకు తిరుగులేని నిదర్శనం. పారిభాషిక పదనిఘంటు నిర్మాణం. 1934లో ఈ బృహత్తర కార్యక్రమానికి పూనుకుని రెండు సంపుటాలుగా దీన్ని ప్రచురించారు. మొదట సంపుటంలో రాజనీతి, ఆర్థిక న్యాయ శాస్త్రాలు, ప్రభుత్వ ఆర్థికవ్యవస్థ స్టాక్ ఎక్ఛేంజి వ్యాపార సహకార రంగాలకు చెందిన ఇంగ్లీషు పదాలను తెలుగు పారిభాషిక పదాలను రూపొందించారు. రెండవ సంపుటిలో గణిత, భౌతిక, రసాయనిక ఆరోగ్య, శరీర నిర్మాణ శరీరధర్మ వైద్య విజ్ఞాన తత్త్వ తర్క శాస్త్రాలకు సంబంధించిన పారిభాషిక పదాలను పొందుపరిచారు. వీటి అర్థాలు నిర్వచనం వివరణలతో ఈ సంపుటాలు పరిపూర్ణత్వాన్ని సాధించాయి. ఇంతటి బృహత్ పారిభాషిక పదసంపుటాలు అంతకు ముందుకాని, ఆ తర్వాత కాని రాలేదని విమర్శకుల అభిప్రాయం. శాస్త్ర వైజ్ఞానిక గ్రంథాలను తెలుగులో అనువదించేవారికి ఈ సంపుటాలు కరదీపికగా వుంటాయి.

1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించటంతో తెలుగువారి చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. ఆంధ్రప్రదేశ్ విధానసభ తొలి స్పీకరుగా అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఆంధ్రజాతీయాభిమాని తెలుగు సాహిత్యాభిమాని, స్వయంగా గ్రంథ రచయిత. 1957లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాళేశ్వరరావుగారి అధ్యక్షతన తెలుగులో పారిభాషిక పదకోశాన్ని పొందించడానికి ఒక గ్లాసరీ కమిటీని ఏర్పాటు చేసింది. బెజవాడ వాస్తవ్యులైన కాళేశ్వరరావుగారికి శివరావుగారు ఈ రంగంలో చేసిన కృషి కూడా బాగా తెలును. అందువలన తనకు చేదోడు వాదోడుగా వుండడానికి కాళేశ్వరరావుగారు శివరావుగారిని ఈ కమిటీలో సభ్యునిగా చేర్చుకున్నారు. నాలు సంవత్సరాల కాలంలో పారిభాషిక పదనిఘంటువు పూర్తి అయింది.

కాళేశ్వరరావుగారి మరణం తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం శివరావుగారి సేవలను వినియోగించుకుంది. 1964లో రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ చట్టాలను తెలుగులోకి అనువదించడానికి ఏర్పాటయిన కమిటీకి సభ్యునిగా నియమించింది. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సైన్సు ఉర్దూ తెలుగు అకాడమీలలో శివరావుగారు సభ్యులు.

1947 నుంచి అనేక సంవత్సరాలు శివరావుగారు బెజవాడ బార్‌కౌన్సిల్ అధ్యక్షునిగా పనిచేశారు. బెజవాడకు సంబంధించిన అనేక సంస్థలలో శివరావుగారికి సన్నిహిత సంబంధాలు వుండేవి.

వృద్ధాప్యకారణంగా శివరావుగారు తన చివరిరోజులను భోపాల్ లోని తన పెద్దకుమారుడు రామచంద్రరావుగారి యింట గడిపారు. అప్పుడు కూడా మైసూరు బెబ్బులి టిప్పుసుల్తాను గురించి ఒక పరిశోధనా గ్రంథం రచిస్తూ అది పూర్తి చేయకుండానే 1992లో తన 94వ ఏట శివ సాయుజ్యం పొందారు.

చివరగా చెప్పాలంటే శివరావుగారు ఒక వ్యక్తికాదు ఒక మహాసంస్థ. ఎంతోమంది విద్వాంసులు. [illegible] ద్వారా కొన్నిసంవత్సరాలు శ్రమిస్తే కాని పూర్తి కాని పనిని ఆయన ఒకంటరు. అకాడమీలతో పోల్చుకొంటే [illegible] కాలంలో పూర్తిచేశారు. ఇటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని విశ్వవిద్యాలయాలుకాని, అకాడమీలుకాని గుర్తించ లేకపోవడం ఆయన గురించి తెలుగువారిలో చాలామందికి తెలియకపోవడం దురదృష్టకరం. ✱

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వర సుప్రభాతమ్

శ్రీ ఎస్.బి.ఎస్. రామారావు గారు శ్రీ సత్యసాయీశ్వర సుప్రభాతమునకు సామాన్య అర్థము, విశేషార్థములతో పాటు చక్కటి వ్యాఖ్య కూడా వ్రాసిన వ్యాసములు 'శ్రీవాణి'కి ప్రత్యేకంగా అందించారు. నవంబరు నుంచి సీరియల్‌గా శ్రీవాణిలో ముద్రించదలిచాము. ఈ సదవకాశమును పాఠకులు సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాను. భగవాన్ సాయి సుప్రభాతం యొక్క అర్థం తెలుసుకొని నిత్యమూ పారాయణం చేసి తరించండి! పాఠకులకు ఈ సదవకాశమును అందిస్తున్న శ్రీవాణిని స్వంతం చేసుకోండి!

- సంపాదకులు